మైనర్‌ డ్రైవింగ్‌ చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అశోక్‌కుమార్‌

మలక్‌పేట: మైనర్‌ డ్రైవింగ్‌ చట్టరీత్యా నేరమని మలక్‌పేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌కుమార్‌ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మలక్‌పేట ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌ నోబుల్‌ కాలేజీలో ట్రాఫిక్‌ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానికి జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా వాహనం రిజిస్ట్రేషన్‌ ఏడాది పాటు రద్దవుతుందన్నారు. కొందరు సిగ్నల్‌ జంపింగ్‌, ఓవర్‌ స్పీడ్‌, డేంజరస్‌ డ్రైవింగ్‌, రాంగ్‌రూట్‌, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. ప్రమాద రహిత సమాజం కోసం అందరూ ట్రాఫిక్‌ నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్సైలు రాము, రామస్వామి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను అప్రమత్తతతో నడపాలి..

నాగోలు: వాహనాలను అప్రమత్తతతో నడిపితే ప్రమాదాలు జరగవని ఉప్పల్‌ ట్రాఫిక్‌ సీఐ లక్ష్మి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బండ్లగూడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం భద్రత భావంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతూ తమ తమ గమ్యాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌ టి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్‌ మేనేజర్‌ శబా షాలిని, అసిస్టెంట్‌ ఇంజినీరింగ్‌ బాలయోగేశ్వరి పాల్గొన్నారు.

24 నుంచి ట్రైబల్‌ యూత్‌ ఎక్స్ఛేంజ్‌ ప్రోగ్రాం



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అధికారులు

సైదాబాద్‌: కేంద్ర ట్రైబల్‌, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 30 వరకు ట్రైబల్‌ యూత్‌ ఎక్స్ఛేంజ్‌ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ హైదరాబాద్‌ జిల్లా యువజన అధికారి కుష్బుగుప్తా పేర్కొన్నారు. సైదాబాద్‌ డివిజన్‌ ఎస్‌బీహెచ్‌ కాలనీలోని తెలంగాణ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఆదివాసీ యువతలో జాతీయ సమగ్రత, ఐక్యత పెంపొందించటం కోసం వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివాసీ యువజన ఉత్సవాల్లో ఝార్ఖండ్‌, ఛత్తీస్‌ఘడ్‌, మహారాష్ట్రలకు చెందిన 200 మంది యువతీ యువకులు, వివిధ రక్షణ దళాలకు చెందిన 20 మంది పోలీస్‌ సిబ్బంది పాల్గొంటారన్నారు. యువతీ యువకులు పరస్పరం తమ అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకునేందుకు ఆదివాసీ సమ్మేళనం దోహదం చేస్తుందని అన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పెండింగ్‌ పనులను పూర్తి చేయాలి



అక్బర్‌బాగ్‌ చౌరస్తాలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పెండింగ్‌ పనులను సత్వరమే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల ఆదేశించారు. మంగళవారం ఆయన అక్బర్‌బాగ్‌, ఛావుని, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్లలో కార్పొరేటర్లతో కలిసి పర్యటిస్తూ వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్‌ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌, వాటర్‌ వర్క్స్‌ అధికారులతో పనులపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్థానికులు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు సయ్యద్‌ మినాజుద్దీన్‌, అబ్దుల్‌ షాహిద్‌ సలామ్‌, ఈఈ వీర్‌ సింగ్‌, ఏఈలు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు చేయాలి



భూగర్భ డ్రైనేజీ లైన్‌ పనులను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్‌

నాగోలు: కాలనీ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. మోహన్‌నగర్‌ జనప్రియ అపార్ట్‌మెంట్‌, బాలాజీ నగర్‌ కాలనీలో రూ. 9 లక్షలతో చేపట్టిన నూతన భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్‌ ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. కాలనీవాసులు అశ్విన్‌ సింగ్‌ ఠాగూర్‌, శ్రీను, సూర్య, ఖుర్షీద్‌, మోహన్‌, వాస్తవ్‌ పాల్గొన్నారు.

చెరువు వ్యర్థమవుతోంది



సరూర్‌నగర్‌ చెరువులో రోజురోజుకు పేరుకుపోతున్న వ్యర్థాలతో దుర్గంధంగా మారుతోంది. దీంతో పాటు గుర్రపు డెక్క పేరుకుపోతోంది. అటుగా రాకపోకలు సాగించే సమయంతో ఘాటైన వాసన వస్తూ రోగాలబారిన పడుతున్నామని పరిసర కాలనీలవాసులు వాపోతున్నారు. చెరువులో గుర్రపుడెక్క తొలగించే కాంట్రాక్టర్‌ను చెత్త తొలగించాలని కోరినా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని ప్రజలు అధికారులను కోరారు. –సైదాబాద్‌

గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తా



చైర్మన్‌ ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రమేష్‌

మలక్‌పేట: గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మూసారంబాగ్‌ శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేసి పాఠకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టులను భర్తీ చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అన్నిరకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ ఉండే విధంగా చూస్తామన్నారు. మూసారంబాగ్‌ లైబ్రేరియన్‌ తారక రమేష్‌, చైర్మన్‌ ఉపేందర్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి పద్మజను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణానగర్‌ లైబ్రేరియన్‌ శంకర్‌, ఇసామియా బజార్‌ లైబ్రేరియన్‌ మహేందర్‌ పాల్గొన్నారు.

అర్జీలు 33,200.. అర్హులు 3,279

- జాబితాలో పేరు లేక ఉసూరుమంటున్న జనం
- కార్యాలయాల వద్ద పడిగాపులు



దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది



రేషన్‌కార్డుల సర్వేను పరిశీలిస్తున్న జెడ్సీ హేమంత కేశవపాటిల్‌

చాదర్‌ఘాట్‌: కొత్త రేషన్‌ కార్డుల కోసం అర్హులైన పేదలు గత పదేళ్లుగా ఎదురు చూపుతోనే కాలం గడుపుతున్నారు. గతేడాది నవంబర్‌లో చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో తమకు రేషన్‌ కార్డులు లేవని వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే తాజాగా కొత్త రేషన్‌ కార్డుల కోసం చేపట్టిన సర్వేలో జాబితాలో వెతుక్కుంటే పేర్లు లేవని తెలుసుకొని ఉసూరుమంటున్నారు. మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని మూసారాంబాగ్‌, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్‌ డివిజన్లలో నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలోనూ ఈ నియోజకవర్గ పరిధిలో (సర్కిల్‌–6) సుమారుగా 33200 మంది రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే.. ప్రభుత్వం మాత్రం గతేడాది నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో సర్కిల్‌–6 నుంచి (మలక్‌పేట) 3279 మందిని అర్హులుగా గుర్తించి జాబితాను రూపొందించింది. ఇప్పుడు చేపట్టే సర్వేలో తమ పేర్లు లేకపోయే సరికి ప్రజలు ఉసూరుమంటున్నారు. ఈ నెల 26 నుంచి కొత్త రేషన్‌ కార్డులు జారీ చేయనుండటంతో తమ పేర్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు గగ్గోలు పెడుతున్నారు.

పేర్లు లేని వారి సంగతేంటి?

వారం క్రితం వచ్చిన జాబితాలో వేలాది మంది పేర్లు లేకపోవడంతో వారంతా నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం పరిశీలనకు వస్తున్న సిబ్బందిని కలిసి తమ పేర్లు ఉన్నాయో లేదో అంటూ చాలా మంది ఆరా తీస్తున్నారు. అన్ని అర్హతలు ఉండి జాబితాలో పేరు లేకపోవటంతో ఆందోళన చెందుతున్న పేదలకు అటు సంబంధిత అధికారులు, ఇటు సర్వే చేస్తున్న సిబ్బంది సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని, ప్రభుత్వం చేతిలో ఉందంటూ మాటదాట వేస్తూ జారుకుంటున్నారు. ఇదిలా ఉండగా నేటి నుంచి కొత్త రేషన్‌ కార్డుల ప్రక్రియ బస్తీ సభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించనున్నారు.

దరఖాస్తుదారులు ఎక్కువ.. సర్వే సిబ్బంది తక్కువ

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ జోనల్‌ పరిధిలోని ఐదు సర్కిళ్లలో రేషన్‌ కార్డుల కోసం సుమారుగా 11,528 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన వారికే కొత్తగా రేషన్‌ కార్డులను జారీ చేయనున్నారు. ఇందు కోసం జోనల్‌ పరిధిలో సుమారుగా 207మందిని సర్వే కోసం నియమించారు. దరఖాస్తులు ఎక్కువగా... సిబ్బంది తక్కువ ఉండడంతో సకాలంలో సర్వే పూర్తి అవుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో జారీచేస్తాం

చాదర్‌ఘాట్‌: సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి మొదటి వారంలో జారీ చేస్తామని మలక్‌పేట సర్కిల్‌–6 డిప్యూటీ కమిషనర్‌ జయంత్‌ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని అందువల్ల కార్డుల జారీలో ఆలస్యమవుతుందన్నారు. సిబ్బంది కొరత, ఇళ్ల సర్వే, ఆస్తిపన్ను వసూళ్లతో కాస్త ఇబ్బందులు తలెత్తాయి. సర్కిల్‌–6లో రేషన్‌ కార్డుల కోసం 33 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.

దరఖాస్తుదారుల వివరాలు ఇలా..

- కాప్రా డివిజన్‌లో 643, ఏఎస్‌రావునగర్‌లో 441, చర్లపల్లిలో 932, మీర్‌పేట హెచ్‌బీకాలనీలో 666, మల్లాపూర్‌లో 967, నాచారం డివిజన్‌లో 689 మంది దరఖాస్తులు చేసుకున్నారు.
- చిలుకానగర్‌ డివిజన్‌లో 563, హబ్సిగూడలో 486, రామంతపూర్‌లో 673, ఉప్పల్‌ డివిజన్‌లో 725 మంది ఉన్నారు.
- నాగోలు డివిజన్‌ పరిధిలో 365, మన్సురాబాద్‌లో 494, హయత్‌నగర్‌లో 390, బీఎన్‌రెడ్డినగర్‌లో 204 మంది దరఖాస్తులు చేసుకున్నారు.
- వనస్థలిపురం డివిజన్‌లో 420, హస్తినాపురంలో 546 మంది, చంపాపేటలో 355, లింగోజిగూడలో 253 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.
- సరూర్‌నగర్‌లో 320, ఆర్కేపురం 459, కొత్తపేట 310, చైతన్యపురి 242, గడ్డిఅన్నారం డివిజన్‌లో 394 మంది ఉన్నారు.
- కొత్త రేషన్‌ కార్డుల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు ఎల్‌బీనగర్‌ జోనల్‌కు 207 మంది సిబ్బందిని నియమించారు. 69 టీమలను ఏర్పాటు చేశారు. సర్వేకు తగినంత సిబ్బందిని నియమించక పోవడంతో సర్వే అసంపూర్తిగా సాగేటట్లు ఉందని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్‌ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

అన్‌మోల్‌ హోటల్‌, అల్‌సఫా డైరీ, జొరాబీ దర్గా పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు..

అగ్రికల్చర్‌ 500కేవీఏ, సాల్విన్‌ మజీద్‌, రామ్‌ మందిర్‌, బిలాల్‌ మజీద్‌, దుర్గామాతా మందిర్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.31, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్‌ రూ.23, దొండ రూ.38, ఆలుగడ్డ రూ.27, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.35, బీట్‌రూట్‌ రూ.19, కీర రూ.35, బీన్స్‌ రూ.40, క్యాప్సికమ్‌ రూ.40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నిధుల మంజూరుకు వినతి

హయత్‌నగర్‌: హయత్‌నగర్‌ డివిజన్‌ గ్రేటర్‌కు శివారులో ఉండడంతో అభివృద్ధిలో వెనకబడి ఉందని డివిజన్‌ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్‌ నవజీవన్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌లో కాలనీలు వేగంగా పెరుగుతున్నాయని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవాలి



రుద్ర శ్రీనివాస్‌

చాదర్‌ఘాట్‌: దుకాణదారులు తమ లైసెన్స్‌లు ప్రతీ యేడు పునరుద్ధరించుకోవాలని మలక్‌పేట సర్కిల్‌–6 ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్‌ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో ట్రేడ్‌ లైసెన్స్‌లు చెల్లించాలని, దుకాణాల్లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వివాహిత అదృశ్యం



పద్మ

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవి వివరాల ప్రకారం..సచివాలయ నగర్‌ కాలనీకి చెందిన బగ్రిగెల పద్మ (35) సోమవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

మహేశ్వరం: మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామంలో ఈ నెల 24న గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగే సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణకు హాజరుకావాలని మంగళవారం ప్రముఖులను ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లకు గౌడ సంఘం నేతలు ఆహ్వాన పత్రికలను అందజేశారు. గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు అల్వాల చంద్రశేఖర్‌ గౌడ్‌, అల్వాల బాలకృష్ణాగౌడ్‌ యాదిష్‌, నాయకులు శంకర్‌, పాండుగౌడ్‌, ఓం ప్రకాష్‌ గౌడ్‌, రాఘవేందర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్‌ నేతలు

లింగోజిగూడ: ఫీజుల పేరుతో విద్యార్థులను అవమానిస్తున్న కార్పొరేటర్‌ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ నేత ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని ఓ పాఠశాల యాజమాన్యం విద్యార్థి రూ.7 వేలు ఫీజు చెల్లించలేదని, పరీక్ష రాయనీయకుండా బయట కూర్చుబెట్టడం సరికాదన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీధర్‌గౌడ్‌, శ్రీనాథ్‌రావు, రోహిత్‌, నరేందర్‌ ఉన్నారు.

బస్తీ దవాఖానా సందర్శన

చైతన్యపురి: బస్తీ దవాఖానాకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించేలా చూస్తామని గడ్డిఅన్నారం కార్పొరేటర్‌ బద్దం ప్రేమ్‌ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీవీనగర్‌ కాలనీలోని బస్తీ దవాఖానాను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్పొరేటర్‌ వెంట జయప్రకాష్‌, మురళి, షేక్‌ ఉమర్‌, రుప్ల, మొగిలి శివరాం, సతీష్‌చారి, టింకు, శశాంక్‌, రఘునందన్‌, జోషి ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్‌ ప్రేమ్‌

లెనిన్‌ ఆశయ సాధనకు కృషి చేయాలి



లెనిన్‌ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

నాగోలు: లెనిన్‌ ప్రపంచ స్థితిగతులను మార్చిన గొప్ప కమ్యూనిస్టు నేత అని సీపీఐ రాష్ట్ర ప్రజా సంఘాల సబ్‌ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. లెనిన్‌ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం న్యూనాగోలులోని ఎస్‌ఎ. డాంగే భవన్‌లో బతరాజు నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన లెనిన్‌ వర్ధంతిలో బొడ్డుపల్లి కృష్ణ పాల్గొని లెనిన్‌ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజకీయ, సామజిక, ఆర్థిక, శ్రమదోపిడీ లేని సమాజం కోసం సోవియట్‌ యూనియన్‌లో తొలి కమ్యూనిస్ట్‌ రాజ్యాన్ని స్థాపించిన విప్లవ నాయకుడని, ఆయన ఆశయ సాధనకు నేటి కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ హమీద్‌, మల్లేష్‌ గౌడ్‌, నిరంజన్‌ రవికుమార్‌, షామాల, ఎండీ.జాఫర్‌, పి. పద్మ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌ మండల సమితి ఆధ్వర్యంలో..



లెనిన్‌ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మన్సూరాబాద్‌: సీపీఐ హయత్‌నగర్‌ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లెనిన్‌ వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి పాల్గొని మాట్లాడారు. రష్యా సామ్రాజ్యవాద చక్రవర్తి అయిన హిట్లర్‌కు వ్యతిరేకంగా 1917లో ఎర్రజెండా చేతబూని పోరాటాలు చేసి ప్రపంచంలోనే మొదటి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం సోవియట్‌ యూనియన్‌ను ఏర్పాటు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, అరుణ్‌కుమార్‌గౌడ్‌, శోభన్‌, వంశవర్ధన్‌రెడ్డి, సుజాత, వెంకట్‌, శ్రీధర్‌రెడ్డి, సుమతి, అలివేణి, యమునా, ముత్తయ్య, శివజ్యోతి, రాములు, సురేందర్‌, రేణుక పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి, హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌

ఎల్‌బీనగర్‌: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని బీఎన్‌ రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వివిధ ప్రాంతాల్లో జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌, డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. వైదేహినగర్‌ సాయిబాబా ఆలయం నుంచి శివాలయం వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని భక్తులు, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్‌ వెంట ఈఈ ఆశలత, ఏసీపీ విజయశ్రీ, డీఈ దామోదరరావు, శానిటేషన్‌ డీఈ నీలిమా, మేధ, ఏఈ రాజ్‌ కుమార్‌, టీపీఎస్‌ అక్బరుద్దీన్‌ ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

సైదాబాద్‌: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సైదాబాద్‌ ఏసీపీ వెంకన్న నాయక్‌ కోరారు. నగర పోలీస్‌ కమిషనర్‌, సౌత్‌ఈస్ట్‌ జోన్‌ డీసీపీ ఆదేశాల మేరకు మంగళవారం ప్రజలకు మేమున్నాం అనే భరోసా కల్పించేందుకు ర్యాపిడ్‌ యాక్షన్‌ బలగాలు, స్థానిక పోలీసులు సైదాబాద్‌, మాదన్నపేటలో ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. సైదాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ నుంచి ప్రారంభమైన మార్చ్‌ సపోటాబాగ్‌, జీవన్‌యార్‌ జంగ్‌ కాలనీ, పూసల బస్తీ, రెడ్డిబస్తీ, చేపల మార్కెట్‌ మీదుగా భరత్‌నగర్‌, మాదన్నపేట వరకు సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ రాఘవేందర్‌, డీఐ ఆనంద్‌, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌, పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ వెంకన్న నాయక్‌

తవ్వారు సరే.. నిర్మాణమెప్పుడో?



ఓల్డ్‌ మలక్‌పేట డివిజన్‌ పరిధిలోని సాయిబాబా దేవాలయం మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం గత 20 రోజుల క్రితం రహదారిని తవ్విన అధికారులు ఇంత వరకు పనులు చేపట్టడం లేదు. కంకర, మట్టిదిబ్బలు ఉండటంతో రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –చాదర్‌ఘాట్‌

PUBLIC NOTICE

Now all General public are hereby informed that my client, **KOTHA VINOD KUMAR**, S/o. Satyanarayana, Aged about 34 years, Occ.: Business, R/o. Plot No.152, H.No.3-2-354, SBH Road, Bank Colony, LB Nagar, Hyderabad, Telangana - 500074, **has entered into an agreement of sale by paying advance sale consideration to Smt. Challa Sandhya**, W/o. Challa Surendra Reddy, **in respect of a House bearing No.3-8-441/A, Plot No.49 (Western Part)**, admeasuring 190sq. yards or 158.85 sq. meters, consisting of Cellar, Ground Floor, and First Floor, plinth area 1400 sq. Feet, total 4200 sq. ft., in Sy.No.60 & 63, under ward No.3, Block No.8 , situated at Suryodaya Colony, Mansoorabad Village, Saroornagar Mandal, L.B. Nagar Municipality, Ranga Reddy District, Telangana, as bounded by North: 40' wide road, South: Plot No.48, East: Plot No.49 (Eastern Part), West: 30' wide road (hereinafter referred as". **the said property).** If anyone having objection/ claims in respect of the said house are invited to submit their objection/claims in the office of undersigned within 7(seven) days from the date of this publication. Later, any objection/ claims will not be considered, and my client will proceed further for registration of sale deed for the said property.

Sd/- G. KONDA SRINIVAS, Advocate
Off.: 3-3-222 , LB Nagar,
Hyderabad, Telangana -74
M: 9030923923

Dt: 21-01-2025
LB. Nagar.